క్లుప్తంగా

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గంగయ్య

జగిత్యాల: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, నాన్‌జాయినింగ్, ఓవర్‌లెఫ్ట్ ఖాళీలను భర్తీ చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గంగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్‌ఎల్‌గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. లెఫ్ట్ ఓవర్ పోస్టులను అర్హత గల ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని, వీలైనంత త్వరగా ఉపాధ్యాయ నియమకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్, శ్రీనివాస్, బన్న, తులసి ఆగమయ్య, ప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


ఈవోకు చెక్కు అందజేస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రస్తుతం బెంగుళూర్‌లో నివాసం ఉంటున్న సిరిపల్లి ధర్మ–వాసవి దంపతులు రూ.1,10116 విరాళం శనివారం దేవస్థానం ఈవో శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దంపతులకు దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపి స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

డైరెక్టర్లకు అభినందన


ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలుపుతున్న డైరెక్టర్లు

జగిత్యాల: కరీంనగర్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లుగా జగిత్యాలకు చెందిన మంగి రవీందర్, ఎండీ.సమివోద్దీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్ను, సాయి, సర్ఫరాజ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత


సెల్‌ఫోన్లు అందించిన ఎస్సై ఉదయ్‌కుమార్

ధర్మపురి: ధర్మపురికి చెందిన మెరుగు శ్రీనివాస్, గొల్లపల్లి మండలంలోని బొంకూరుకు చెందిన ఐతం వెంకటేశ్ పోగొట్టుకున్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి శనివారం ఎస్సై ఉదయ్‌కుమార్ వారికి అందజేశారు.

స్నేహితుడి కూతురి వైద్యానికి సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

మల్యాల: మండల కేంద్రానికి చెందిన మ్యాదరి ప్రసాద్ కూతురు కాలేయ వ్యాధితో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ప్రసాద్ 1998–1999 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు చేయి చేయి కలిపి రూ.50,000 సేకరించి, ప్రసాద్‌కు అందజేశారు. ఆపదలో మేమున్నామంటూ భరోసా ఇస్తూ, వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం చేసిన స్నేహితులకు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డి.గోపి, పొన్నం మహేశ్, ఇట్టిరెడ్డి అంజిరెడ్డి, ఉప్పుల నరేశ్, గోనే పరమేశ్వర్, వి.శేఖర్, నక్క సంతోష్, ఆనంద్, డి.నరేశ్, ఎం.ప్రభాకర్, ఎ.శ్రీనివాస్, కె.మహేశ్, జి.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి భళా..

సండే స్పెషల్

వారసత్వ కళ



- దశాబ్దాలుగా వన్నె తగ్గని నగిషీ కళ
- తరాలు మారినా తరగని ఆదరణ
- దేవతల విగ్రహాలు, బొమ్మల తయారీతో ఉపాధి

జగిత్యాలటౌన్: తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన నగిషీ కళను నమ్ముకుని ఉపాధి పొందుతున్నారు పట్టణానికి చెందిన నగిషీ కళాకారులు. భక్తుల ముడుపుల కోసం సమర్పించే బొమ్మలు, దేవతల విగ్రహాల తయారీనే ఉపాధిగా మలుచుకుని నగిషీ కళకు సరికొత్త రంగులద్దుతున్నారు. ప్రతి ఏటా మొహర్రం సందర్భంగా పులి వేషదారులు ధరించే పులి బొమ్మల తయారీతో పాటు గ్రామదేవతలు ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి విగ్రహాల తయారీతో పాటు భక్తులు తమ కోర్కెలు నెరవేరిన తర్వాత ఆలయాల్లో సమర్పించే బొమ్మలు తయారు చేస్తూ వారసత్వ నగిషీ కళకు జీవం పోస్తున్నారు. తరాలు మారిన తరగని ఆదరణ సొంతం చేసుకున్న నగిషీ కళపై సండే స్పెషల్.

విగ్రహాల తయారీ

గ్రామాలు పట్టణాల్లో ఎల్లమ్మతల్లి, పోచమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహాలు తయారు చేయడం వాటికి సరిపడే రంగులు వేసే నగిషీ కళాకారులు మంచి గుర్తింపుతో పాటు ఉపాది సైతం పొందుతున్నారు.

మొక్కుకో బొమ్మ

పిల్లలు అనారోగ్యం పాలయినప్పుడు తిరిగి కోలుకున్నాక గుర్రం లాగా పరుగు తీయాలని కోరుకుంటూ గుర్రం బొమ్మలు, పిల్లలు లేని దంపతులకు చిలుకల్లాంటి పిల్లలు కలగాలన్న కోర్కె నెరవేరితే చిలుక బొమ్మలను తాము నమ్ముకున్న ఆలయాలకు సమర్పించడం ఈ ప్రాంతంలో ఆనవాయితీగా వస్తోంది. ఇలా భక్తులు తమ మొక్కుల కోసం సమర్పించేందుకు పెద్దపులిపై స్వారీ చేస్తున్న పెద్దమ్మ తల్లి గుర్రం, రామ చిలుక తదితర బొమ్మలు తయారు చేసి విక్రయిస్తూ ఉపాది పొందడంతో


బొమ్మలు కొంటున్న స్థానికులు

పాటు దైవ కార్యంలో పాలుపంచుకుంటూ తమకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటున్నారు నగిషీ కళాకారులు.

సైజును బట్టి ధర

కర్రతో తయారు చేసిన పులిపై స్వారీ చేస్తున్న పెద్దమ్మ తల్లి విగ్రహానికి రూ.1600 కాగా గుర్రం, చిలుక విగ్రహాలకు సైజును బట్టి రూ 100 నుంచి 300వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నగిషీ కళను కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రభుత్వం చేయూతనందించాలి. ఈ కళ మా పూర్వీకుల నుంచి మాకు వారసత్వంగా వచ్చింది. గతంలో అన్ని విగ్రహాలు కర్రతోనే తయారు చేసేవాళ్లం. కర్ర లభ్యత తగ్గడంతో ప్రస్తుతం కొన్ని విగ్రహాలు,బొమ్మలు కర్రతో తయారు చేస్తుండగా మరి కొన్ని పీవోపీతో తయారు చేస్తున్నాం.

దసూరి సత్తయ్య, కళాకారుడు

పులి బొమ్మలు కొనుగోలు చేస్తా



చిన్నప్పుడు మా అమ్మ నాన్నల మొక్కు మేరకు నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ప్రతి ఏటా మొహర్రం పండుగ సందర్భంగా పెద్దపులి వేషం వేయడం ఆచారంగా వస్తోంది. పులి వేషధారణకు సంబంధించి బొమ్మలు వారి దగ్గరే కొంటుంటాం.

– కాంపెల్లి వెంకటేశ్,రంగపేట

మొక్కులు చెల్లించేందుకు



కోరిన కోర్కెలు తీరినప్పుడు ఆలయంలో మొక్కు తీర్చుకునేందుకు గుర్రం, రామ చిలుకు బొమ్మలు కొనుగోలు చేస్తుంటాం. దేవుని కృపతో మా కుటుంబమంతా సంతోషంగా ఉన్నాం.

– మారిశెట్టి బాలరాజ్ ఆర్టీసీ ఉద్యోగి జగిత్యాల

ఇరు గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సారంగాపూర్: ఇరు గ్రామాల రైతులకు న్యాయం జరిగేలా, శాంతియుతంగా భూ సమస్య పరిష్కరించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామ శివారులో వివాదాస్పద భూమిని ఆర్డీవో, రెవెన్యూ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. సర్వే నంబర్ 306లో 110 ఎకరాల వ్యవసాయ భూమి బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయి, ధర్మపురి మండలం ఆరెపల్లి గ్రామాల ప్రజల మధ్య వివాదం నెలకొంది. ఇరు గ్రామాల ప్రజలను సమన్వయపరిచి భూచట్టం కింద అధికారులు సమస్యను పరిష్కరించాలని హైకోర్టు 2023 డిసెంబర్‌లో తీర్పు నిచ్చింది. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రెతులకు న్యాయం చేయాలని ఆర్డీవోకు సూచించారు. ఆయన వెంట బీర్‌పూర్,ధర్మపురి తహసీల్దార్లు నరేశ్, కృష్ణచైతన్య, ఆర్‌ఐ శ్రీనివాస్, రైతులు ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్

యువకులు క్రీడల్లో రాణించాలి

గొల్లపల్లి : యువకులు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో మండల యూత్ కాంగ్రెస్ కన్వీనర్ పురంశెట్టి గౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పురంశెట్టి పద్మ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


ఎంపీ అర్వింద్‌తో విద్యాసాగర్‌రావు

కోరుట్ల: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తండ్రి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయనను కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు శనివారం పరామర్శించారు. హైదారాబాద్‌లోని ఎంపీ నివాసంలో కలిసి డీ. శ్రీనివాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

లయన్స్‌క్లబ్‌తోనే నిరుపేదలకు సేవలు

రాయికల్: లయన్స్‌క్లబ్‌తోనే నిరుపేదలకు సేవ కార్యక్రమాలు చేయవచ్చని లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ మోర భద్రేశం అన్నారు. శనివారం రాయికల్ లయన్స్‌క్లబ్ 12వ కార్యవర్గ ప్రమాణస్వీకారానికి రీజినల్ చైర్‌పర్సన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్‌క్లబ్ సేవ కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమన్నారు. నిరుపేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కడకుంట్ల నరేశ్, కోశాధికారిగా కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, కుర్మ సుదర్శన్‌లను, కార్యవర్గ సభ్యులుగా దాసరి గంగాధర్, బోడుగం అంజిరెడ్డి, బొమ్మకంటి నవీన్, సుదవేని మురళీ, కొయ్యాడి మహి


ప్రమాణస్వీకారం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పాల్, పారిపల్లి శివప్రసాద్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, జోన్ చైర్మన్ గడ్డం శంకర్‌రెడ్డి, ఎక్స్‌టెన్షన్ చైర్మన్ ఆడెపు మధు, చంద్రప్రకాశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం



రాయికల్: మండలంలోని రాజానగర్, ధర్మాజీపేట తండాల్లో శనివారం ఎక్సైస్ సీఐ సర్వేశ్వర్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజమౌళి ఆధ్వర్యంలో శనివారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. పట్టుబడ్డ 250 లీటర్ల బెల్లం పానకం, నాటుసారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ సర్వేశ్వర్ మాట్లాడుతూ గుడుంబా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై స్వప్న, రాయికల్ ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

వెల్గటూర్‌లో వన మహోత్సవం

వెల్గటూర్ : ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వెల్గటూర్‌లో వన మహోత్సవం నిర్వహించారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బసంత్‌నగర్‌కు చెందిన పరికిపండ్ల నరహరి మార్గదర్శకంలో ఆలయ ఫౌండేషన్ సభ్యుడు మిట్టపల్లి రాజేందర్ , బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్ధన్ ఆధ్వర్యంలో కోటిలింగాల రోడ్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈవో రమేశ్, సిరిపురం తిరుపతి, భూమేశ్, గట్ల రాజేందర్, సుద్దాల రమేశ్, సురేశ్, పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా గంజాయి వినియోగం

కథలాపూర్: గమ్మత్తు కోసం గంజాయి సేవిస్తున్న కొందరు యువకులు మత్తులో గ్రామాల్లో వారు చేస్తున్న వికృత చేష్టలతో విసిగిపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గంజాయి సేవిస్తున్నవారి సంఖ్య రోజురోజుకి పెరిగిపోవడంతో ఎప్పుడేమి జరుగుతుందోనని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అక్రమంగా గంజాయి విక్రయాలపై, సరఫరాపై అధికార యంత్రాంగం నిఘా పెట్టగా... అలవాటు పడినవారికి యథావిధిగా దొరుకుతున్నాయనే విమర్శలున్నాయి. పలు గ్రామాల్లో గంజాయిని సిగరేట్లలో నింపుతూ విక్రయిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. గంజాయి సేవిస్తున్న వారిలో ఎక్కువగా ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న కొందరు బాలురు ఉన్నట్లుగా మండలంలో ఇటీవలే జరిగిన సంఘటనల ద్వారా వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉండగా.. గంజాయి సేవిస్తున్న పలువురు యువకులు ఆయా గ్రామాల్లో చేస్తున్న ఆగడాలతో ప్రజలు విసిగిపోతుండటం బాధాకరం. మండలంలోని ఓ గ్రామంలో గంజాయి మత్తులో ఉన్న యువకులు ఇతరుల డ్రెస్సులు వరుసగా వారం రోజులుగా దొంగతనం చేస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. డ్రెస్సుల దొంగలను గుర్తించాలని



పక్కా ప్రణాళికతో బాధితులు వారి వాడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. స్థానిక యువకులు ఇద్దరు డ్రెస్సుల దొంగతనానికి పాల్పడినట్లు రెండు రోజుల క్రితం సీసీ పుటేజీల్లో గుర్తించారు. మరో గ్రామంలో పాఠశాల స్థాయి విద్యార్థులు కొందరు సాయంత్రం వేళల్లో బ్యాచ్‌గా ఏర్పడి గ్రామశివారులో గంజాయి సేవించి మత్తులో ఓ వ్యక్తి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిసింది. గంజాయి బ్యాచ్ చేస్తున్న ఆగడాలకు ప్రజలు విసిగిపోతున్నప్పటికీ, వాటి విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి గంజాయి సేవిస్తున్నవారితోపాటు వాటిని విక్రయిస్తున్న దుకాణాలపై, అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోని, గంజాయిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్రిశక్తి ఆలయంలో సామూహిక కుంకుమార్చన

మెట్‌పల్లి: పట్టణంలోని త్రిశక్తి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధ్యావనపల్లి రాజారాం, బేతు భాస్కర్, భానుమూర్తి, అన్నం నాగరాజు, ఉడుత శ్రీనివాస్, గుజ్జెటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కృషి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్: ఆరు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం సారంగాపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో 10 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, 47 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్నికల కోడ్‌తో సంక్షేమ పథకాల అమలులో జాప్యం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో వసతులు కల్పించాలని వినతి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సరఫరా


వినతిపత్రం అందిస్తున్న డబుల్ ఇళ్ల లబ్ధిదారులు

మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రావు, చెరుకు జాన్, సత్తిరెడ్డి, రాజిరెడ్డి, చంద్రారెడ్డి, గంగన్న, రాజేశ్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గడ్డం గంగారెడ్డి మోకాళ్ల కీళ్ల సమస్యలతో బాధపడుతుండగా శస్త్ర చికిత్స కోసం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారం రూ.80 వేల ఎల్‌వోసీ అందజేశారు.

‘జువ్వాడి చొరవతోనే టీటీడీ నిధులు’

కోరుట్లరూరల్/మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావుల కృషితోనే కోరుట్ల నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ నాయకులు శనివారం మాట్లాడారు. రెండేళ్లుగా అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు టీటీడీ మెంబర్‌గా ఉండి కూడా నిదులు మంజూరు చేయించలేదన్నారు. జువ్వాడి రత్నాకర్‌రావు మంత్రిగా ఉండి ప్రతీ ఆలయానికి ధూప దీప నైవేద్యం పథకం ద్వారా నిధులు ఇచ్చారన్నారు. పదేళ్లు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యాసాగర్‌రావు టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలో దర్శనం టిక్కెట్లను బ్లాక్‌లో అమ్ముకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. మరోసారి అనుచితంగా మాట్లాడితే తగిన గుణ పాఠం చెబుతామని హెచ్చరించారు.కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గడ్డం వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, మాజీ జెడ్పీటీసీ తోట గంగాదర్, కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండలాధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు దుదిగం గంగాధర్, బీసీ సెల్ అధ్యక్షుడు బూస రాజేశ్వర్, రాంప్రసాద్, జెట్టి లక్ష్మణ్, ఆడెపు రమణ, జాజాల రాజ్‌కుమార్, జాకీర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ప్రకటనపై హర్షం

జగిత్యాలటౌన్: జూన్ 25ను రాజ్యాంగ హత్య దినంగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం మాట్లాడారు. 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అధికార దుర్వినియోగంతో జూన్ 24న అర్ధరాత్రి దేశంలో ఎమర్జెన్సీని విధించిందన్నారు. రాత్రికి రాత్రి దేశంలోని ప్రతిపక్ష నాయకులను, విద్యార్థి నాయకులను జైళ్లలో పెట్టి ఎలాంటి కారణం లేకుండానే లక్షలాది మంది యువకులను అరెస్టు చేయించిందని గుర్తు చేశారు. సుమారు 21 నెలల పాటు దేశంలో విధించిన ఎమర్జెన్సీ కారణంగా పౌరుల హక్కులు కాలరాశారని అన్నారు. నాటి ఎమర్జెన్సీ దినాన్ని నేడు రాజ్యాంగ హత్య దినంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు అక్కినపెల్లి కాశీనాథం, వేముల పోచమల్లు, బండారి మల్లికార్జున్, నరేందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అలరించిన పులుల వేషధారణ


రాయికల్: పులివేషధారణలో యువకులు

రాయికల్: మొహర్రం సందర్భంగా పట్టణంలో శనివారం యువకులు పులివేషధారణలో అలరించారు. పలు వార్డుల్లో వివిధ పులి వేషధారణలతో యువకులు సందడి చేయడంతో చిన్నారులు, పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

మల్యాల: మండలంలోని పీరీల మొక్కులు తీర్చుకునేందుకు యువకులు వేసిన పెద్ద పులివేషాలు అలరించాయి. దండోరా డప్పు చప్పుళ్ల మధ్య యువకులు పెద్దపులి చారల రంగులు పూసుకుని, స్థానిక గుండం చుట్టూ తిరిగి, పీరీలకు మొక్కి, మొక్కులు తీర్చుకున్నారు.

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో పులివేషధారణలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఏటా మోహర్రం వేడుకలో భాగంగా పులివేషాలు వేస్తుంటారు.

బుగ్గారం మండల వాసికి డాక్టరేట్

ధర్మపురి(బుగ్గారం): బుగ్గారం మండల కేంద్రానికి చెందిన నక్క రాజు విద్య, ఆధ్యాత్మిక రంగాల్లో చేసిన సేవలకు ఆసియా ఇంటర్నేషనల్ రిసెర్చ్ యూనివర్శిటీ వారు శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నక్క రాజును పలువురు అభినందించారు.

విద్యుదాఘాతంతో వానరం మృతి

మెట్‌పల్లిరూరల్: ట్‌పల్లి మండలం కొండ్రికర్ల గ్రామంలో హనుమాన్ ఆలయం పక్కనే ఉన్న ఓ ఇంటి వద్ద శనివారం ఓ వానరం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. దీంతో ఆ వానరాన్ని తీసుకెళ్లి గ్రామ శివారులోని వాగు వద్ద గ్రామస్తులు ఖననం చేశారు.

బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

జగిత్యాల: బాడీబిల్డింగ్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గంను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.శైలేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా భీమయ్య, చిన్నగంగారాం, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, జాయింట్ కార్యదర్శిగా ఎస్.రమేశ్, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా నరేశ్, శంషోద్దీన్‌లను ఎన్నుకున్నారు. బాడీబిల్డింగ్ మెంబర్స్ అసోసియేషన్ చైర్మన్‌గా మంచాల కృష్ణ ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర బాడీబిల్డింగ్ అసోసియేషన్ అబ్జర్వర్లుగా ఇంతియాజ్, ముస్తాక్‌అలీ హాజరయ్యారు.

పాఠశాలలో బోనాలు

జగిత్యాలరూరల్: మండలంలోని మోరపల్లి శ్రీవిద్య పాఠశాలలో శనివారం వైభవంగా బోనాల పండగ నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు నెత్తినెత్తుకోగా బాలురు పోతురాజుల వేషధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఏఈ సుందర్ తెలిపారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

కథలాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో, భీమారం మండలం మన్నెగూడెం, దేశాయిపేట, గోవిందారం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ జమీల్‌పాషా తెలిపారు.